సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 28 । మార్చి । 2025



'దాల్మియా'పై ప్రజాగ్రహం

మైలవరం మండలంలోని దాల్మియా పరిశ్రమను.. తమ సమస్యలు పరిష్కరించిన తర్వాతే విస్తరించాలని ప్రజలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
కడప	6.30	4.58
పులివెందుల	6.33	5.03
ప్రొద్దుటూరు	6.32	5.02

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.0/24.4

జిల్లాలో గురువారం 24.4 – 39.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

జెడ్పీ చైర్మన్ ఏకగ్రీవం

- బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఎన్నిక
- ఎన్నికల్లో పాల్గొన్న 41 మంది జెడ్పీటీసీలు
- టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఫిరాయింపు జెడ్పీటీసీలు గైర్హాజరు
- చైర్మన్ చేత ప్రమాణ స్వీకారం చేయించిన కలెక్టర్



జెడ్పీ సీఈఓకు నామినేషన్ పత్రం అందిస్తున్న రామగోవిందురెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు



రామగోవిందురెడ్డికి జెడ్పీ చైర్మన్‌గా ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జెడ్పీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ప్రత్యేక సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. వైఎస్సార్‌సీపీ బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ చైర్మన్ ఎన్నిక కోసం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 41 మంది జెడ్పీటీసీలు హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవికి అభ్యర్థిని ప్రతిపాదించాలని కలెక్టర్.. జెడ్పీటీసీ సభ్యులను కోరడంతో పోరుమామిళ్ల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ అలియాస్ చెన్నయ్య, వేముల జెడ్పీటీసీ సభ్యుడు కోకటం వెంకటబయపురెడ్డిలు బి.మఠం జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి పేరును ప్రతిపాదించడంతో పాటు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. తదుపరి ఏ ఒక్క అభ్యర్థి పేరును కూడా జెడ్పీటీసీ సభ్యులు ప్రతిపాదించలేదు. ఆ విషయాన్ని మూడు పర్యాయాలు.. ఎన్నికల అధికారైనా కలెక్టర్ కోరారు. రెండవ పేరు ప్రతిపాదన రాకపోవడంతో బి.మఠం జెడ్పీటీసీ ముత్యాల రామగోవిందురెడ్డిని వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ముత్యాల రామగోవిందురెడ్డితో జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా ఎన్నికైన రామగోవిందురెడ్డికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఉదయం 10 గంటలకే నామినేషన్ దాఖలు

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి.. గతంలో ఒంటిమిట్ట జెడ్పీటీసీగా ఉంటూ జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి, ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఒంటిమిట్ట జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలకు రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు.. ఎన్నికలు నిర్వహించారు. దీంతో జెడ్పీ చైర్మన్ అభ్యర్థిగా ముత్యాల రామగోవిందురెడ్డి.. జెడ్పీ సీఈఓ చాంబర్‌లో ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి, డీసీ గోవిందురెడ్డి తదితరులతో కలిసి వెళ్లి.. సీఈఓ ఓబుళమ్మకు నామినేషన్ పత్రం అందజేశారు. ఆయనను పోరుమామిళ్ల జెడ్పీటీసీ చెన్నయ్య, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డిలు చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించారు. అనంతరం ఏకైక నామినేషన్ దాఖలు కావడం, ఆపై కలెక్టర్ 'ఇంకా ఎవరైనా, మరే ఇతర సభ్యుడైనా చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదిస్తారా' అని కోరినా.. హాజరైన జెడ్పీటీసీల్లో ఎలాంటి స్పందన రాలేదు. వెరసి ఏకగ్రీవంగా ముత్యాల రామగోవిందురెడ్డిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

టీడీపీ మద్దతుదారులు గైర్హాజరు

జిల్లాలో 50 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు ఖాళీ ఏర్పడ్డాయి. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా జెడ్పీటీసీలు అందరూ వైఎస్సార్‌సీపీ సభ్యులే. కాగా వారిలో ఓబులవారిపల్లె, చిన్నమండెం, వీరపునాయునిపల్లె, ముద్దనూరు, జమ్మలమడుగు జెడ్పీటీసీలు పార్టీ ఫిరాయించారు. టీడీపీ జెడ్పీటీసీ ఒకరు, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన ఐదుగురు జెడ్పీటీసీలు.. జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనలేదు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాతృమూర్తి మృతి కారణంగా.. ఈ ఎన్నికల్లో పాల్గొన లేకపోయారు. తక్కిన 41 మంది సభ్యులు సమావేశానికి హాజరై ఏకగ్రీవంగా ముత్యాల రామగోవిందురెడ్డిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నుకోవడం విశేషం.

అభినందనల వెల్లువ

జెడ్పీ చైర్మన్‌గా ఆశీనులైన రామగోవిందురెడ్డికి పెద్ద ఎత్తున అభినందనలు లభించాయి. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎమ్మెల్సీలు డీసీ గోవిందురెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎస్‌బీ అంజద్‌బాషా, ఎస్.రఘురామిరెడ్డిలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అభినందనల కార్యక్రమంలో పాల్గొన్నారు.



జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డిని అభినందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ నేతలు



జెడ్పీ చైర్మన్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పని చేయని టీడీపీ కుట్రలు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కుట్రలు, కుయుక్తులు పని చేయలేదని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన ఎం.రామగోవిందురెడ్డిని అభినందించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'జిల్లా పరిషత్‌లో 47 మంది సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే. ఒకే ఒక్కరు మాత్రమే టీడీపీ సభ్యుడు. బలం లేని కారణంగా జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో పోటీలో లేమంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి ప్రకటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నామంటూ వ్యాఖ్యానించారు. ఆ మరుసటి రోజే అదే టీడీపీ జెడ్పీటీసీ జయరామిరెడ్డి ద్వారా.. జెడ్పీ చైర్మన్ ఎన్నికలు నిలుపుదల చేయాలంటూ స్టేటస్‌కో కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. తెలుగుదేశం పార్టీ నేతల మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదన్నది సుస్పష్టం' అని ఎంపీ అన్నారు.

ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అనైతిక చర్యలు

కడప మేయర్ సురేష్‌బాబును పదవీచ్యుతున్ని చేయాలని ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులు విశ్వయత్నం చేస్తున్నారని, ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. 'కార్పొరేషన్‌లో అధికారికంగా టీడీపీకి సంఖ్యాబలం లేదు. ఒకే ఒక్క కార్పొరేటర్ మాత్రమే ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్‌కు షోకాజ్ నోటీసు అందక మునుపే.. వీరిద్దరు చేతిలో పట్టుకొని షోకాజ్ నోటీసులు చూపుతున్నారు. అంటే ప్రభుత్వం నుంచి వీరే షోకాజ్ ఇప్పించారని, ఇట్టే అర్థం కాలేదా? ప్రజలు ఆ మాత్రం అర్థం చేసుకోలేరా? ఇంత ఛీప్‌గా కడప ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు మథనపడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలకు శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సమయం కోసం వేచి ఉన్నారు' అని ఆయన వివరించారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణీకులు 9959225848 నెంబరుకు గానీ, వాట్సాప్‌కుగానీ ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని టీటీసీ 42 రోజుల వేసవి ట్రెనింగ్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ కోర్సు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలో మే 1వ తేదీ నుంచి జూన్ 11 వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. అప్లై చేయడానికి ఏప్రిల్ 24వ తేదీతో గడువు ముగుస్తుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత జిల్లాకు సంబంధించిన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అప్లికేషన్ ప్రింట్‌తోపాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సబ్మిట్ చేయవలెనని వివరించారు. మే 1 నుంచి కడప చెమ్మియాపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

భక్తిశ్రద్ధలతో షబ్బే ఖద్ర్ ప్రార్థనలు

కడప కల్చరల్: మసీదులన్నీ విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. ఆ ప్రాంగణాలన్నీ ఆధ్యాత్మిక చింతనతో వెలుగుతున్నాయి. పవిత్ర ఖురాన్‌లోని దైవ సందేశం గురించి వివరిస్తున్న గురువుల బోధనలతో భక్తిభావనను నింపుతున్నాయి. షబ్బే ఖద్ర్ (బడీరాత్) ప్రత్యేక ప్రార్థనలతో ఆయా ప్రాంతాలు కొత్త కళను సంతరించుకున్నాయి. రంజాన్ మాసంలో అతి ముఖ్యమైన చివరిఘట్టం గురువారం షబ్బే ఖద్ర్‌తో ప్రారంభమైంది. బడీరాత్ నిర్వహణ కోసం రెండు, మూడు రోజుల ముందునుంచి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని మసీదుల్లో రాత్రి తరావీ ప్రార్థనల అనంతరం ముఖ్యఘట్టం ప్రారంభమైంది. ఈరోజున ఆధ్యాత్మిక సందేశం ఇచ్చేందుకు ఆహ్వానించిన దేశంలోని ప్రముఖ గురువులు బోధనలను ప్రారంభించారు. పవిత్ర ఖురాన్‌లోని పలు ముఖ్యమైన ఘట్టాలను వారు ఈ సందర్భంగా వివరించారు. మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జీవితంలోని ముఖ్యమైన అంశాలు, ఆయన బోధనలను గురించి కూడా తెలియజేశారు. భక్తుల సామూహిక ప్రార్థనలు (జికర్) నిర్వహించారు. రాత్రంతా మసీదు ప్రాంగణాలలో భక్తులు పూర్తి ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. దాదాపు తెల్లవారు జామున సెహరి వరకు ఈ బోధనలు కొనసాగాయి.

ఉప పోరు.. వైఎస్సార్‌సీపీ జోరు

పల్లెల్లో మళ్లీ ఎన్నికల కోలాహలం ప్రారంభం అయింది. వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన స్థానిక సంస్థలకు సంబంధించిన ఉప ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి పట్టు నిలుపుకొంది. ఈ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగకపోయినా.. తమ మద్దతుదారులను గెలుపించుకునేందుకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ సర్వశక్తులు ఒడ్డటం గమనార్హం. జిల్లాలో 8 ఉప సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు.. 3 స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు. టీడీపీ ప్రలోభాలు, బెదిరింపులకు దిగినా.. ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు మెంబర్లు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం విశేషం.

8 మంది ఉప సర్పంచుల ఎన్నిక

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో గురువారం వివిధ మండలాల్లో 8 మంది ఉప సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక మాత్రం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఈ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగపోయినా.. వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారులే బరిలో నిలిచి, గెలుపొందడం విశేషం. కావున ప్రజలు పార్టీలకు సంబంధించిన ఎన్నికలుగానే.. వీటిని భావిస్తుండటం గమనార్హం.

మండలం	గ్రామం	పేరు, మద్దతు తెలిపిన పార్టీ
బి.మఠం	గొడ్లవీడు	బద్వేల్ రామలక్షుమ్మ, వైఎస్సార్‌సీపీ
కమలాపురం	కోగటం	కనపర్తి రవణమ్మ, వైఎస్సార్‌సీపీ
సింహాద్రిపురం	అంకాలమ్మ గూడూరు	చల్లా శివస్వప్న, వైఎస్సార్‌సీపీ
ఎర్రగుంట్ల	తుమ్మలపల్లె	గొర్ల తులశమ్మ, వైఎస్సార్‌సీపీ
ఎర్రగుంట్ల	చిర్రాజుపల్లె	యెద్దలపల్లె సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ
చెన్నూరు	ముండ్లపల్లె	షేక్ అబ్దుల్లా, టీడీపీ
దువ్వూరు	ఇడమడక	ముద్దం లక్ష్మీదేవి, టీడీపీ
సీకే దిన్నె	బుసిరెడ్డిపల్లె	డి.వెంకటరమణారెడ్డి, టీడీపీ

అంకాలమ్మ గూడూరులో ఉత్కంఠ

- టీడీపీ నాయకుడి దౌర్జన్యం
- ఉప సర్పంచ్ పదవి వైఎస్సార్‌సీపీ కైవసం
- ఉప సర్పంచ్‌గా చల్లా శివ స్వప్నారెడ్డి



ఉప సర్పంచ్ శివ స్వప్నారెడ్డికి డిక్లరేషన్ పత్రం అందిస్తున్న ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక ఎంతో ఉత్కంఠ మధ్య జరిగింది. ఎట్టకేలకు.. వైఎస్సార్‌సీపీ బలపరిచిన చల్లా శివ స్వప్నారెడ్డిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈమెను గతంలో ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నా.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఉప సర్పంచ్‌కు రాజీనామా చేయడంతో నోటిఫికేషన్ విడుదలైంది. తిరిగి ఆమెనే ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలని వార్డు మెంబర్లు ప్రయత్నించగా, ఇటీవల 5వ వార్డు అభ్యర్థి బాబు రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకుని ఉప సర్పంచ్ ఎన్నికలో పోటీకి దిగారు. గ్రామంలో 10 వార్డులు ఉండగా.. అతనితో కలిపి ముగ్గురు వార్డు సభ్యులు బాబురెడ్డికి మద్దతు పలికారు. ఒక సభ్యుడు తటస్థంగా ఉండగా, సర్పంచ్ అంకాలమ్మతో కలిసి మిగిలిన వార్డు సభ్యులంతా ఉప సర్పంచ్‌గా చల్లా శివ స్వప్నారెడ్డికి మద్దతు పలకడంతో ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. దీన్ని బాబు రెడ్డి జీర్ణించుకోలేక ఎన్నిక వాయిదా వేయాలని ఫోరం సభ్యులందరూ వచ్చినా కూడా.. రాలేదంటూ చేతులెత్తిన వ్యక్తులను తనకు మద్దతు పలకాలని భయభ్రాంతులకు గురిచేశారు. అలాగే 'ఏకంగా సర్పంచ్‌ను కూడా భయపెట్టిన మీరు పార్టీ మారారని, మీకు మద్దతిచ్చే ప్రసక్తే లేదు' అని సభ్యులు ఖరాకండిగా చెప్పడంతో బాబురెడ్డి అల్లర్లు సృష్టించాలని ప్రయత్నించారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్ సమస్య జటిలం కాకుండా బాబురెడ్డిని వారించి బయటకు పంపించారు. అనంతరం ఉప సర్పంచ్ శివ స్వప్నారెడ్డికి ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి డిక్లరేషన్ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ శివ స్వప్నారెడ్డి మాట్లాడుతూ తనను మళ్లీ ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవడానికి సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అయితే గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌లు పర్యవేక్షించారు.

అడ్డదారులు తొక్కి..

- వైస్ ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాల పర్వం

ఖాజీపేట/ఒంటిమిట్ట: వైఎస్ఆర్ జిల్లాలో గురువారం ఖాజీపేట, ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అడ్డదారులు తొక్కి.. అభ్యర్థులను గెలుపించుకుంది. ప్రలోభాలకు గురి చేసి వైఎస్సార్‌సీపీ వారిని తమ పార్టీలో చేర్చుకుని.. గెలుపు వాకిట నిలిచింది. టీడీపీ అధికార బలంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు విమర్శించారు.

- ఒంటిమిట్ట మండల పరిషత్ ఉపాధ్యక్ష-2 ఎన్నికల్లో.. వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఎంపీటీసీల కోరం ఉన్నప్పటికీ అభ్యర్థి ఎంపిక విషయంలో మనస్పర్థలు పొడుచూపాయి. ఇదే అదునుగా భావించిన టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి తన అధికార, ఆర్థిక బలాన్ని అడ్డుపెట్టి, ఎన్నికల అధికారులను భయపెట్టి వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఎంపీటీసీ నల్లగొండ లక్ష్మీదేవిని రెబల్ అభ్యర్థిగా పోటీ చేయించి ఎన్నికను నిర్వహించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.
- ఖాజీపేట ఉపమండలాధ్యక్ష స్థానం ఎన్నిక విషయంలోనూ టీడీపీ ఇదే పంథా ఎంచుకుంది. ఖాజీపేట మండలంలో మొత్తం 14 ఎంపీటీసీలు ఉన్నాయి. గతంలో 14 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. అందులో చెన్నముక్కపల్లె ఎంపీటీసీ రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఖాజీపేట-3 చంద్రభాస్కర్‌రెడ్డి, నాగసానిపల్లె ఎంపీటీసీ సుహాసినీ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఖాజీపేట -2 ఎంపీటీసీ కరీమున్నీసా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పార్టీ బలం 10కి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యక్ష స్థానం కోసం వైఎస్సార్‌సీపీ తరఫున రావులపల్లె ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి పోటీ చేశారు. ఆయనకు పోటీగా వైఎస్ఆర్‌సీపీ రెబల్ అభ్యర్థి భూమాయపల్లె ఎంపీటీసీ ముమ్మడి స్వప్న పోటీ చేశారు. ఈ పోటీల్లో రెండు ఓట్ల తేడాతో స్వప్న గెలిచారు.

అధికారం అండ.. దౌర్జన్య కాండ

- అధికారం కోసం అడ్డదారులు
- బెదిరించి.. భయపెట్టినా దక్కని పదవి
- అర్హత లేకున్నా పోటీ

ప్రొద్దుటూరు: తమకు అర్హత లేకున్నా సాదారణమైన ఉపసర్పంచ్ పదవిని తమ వర్గీయులకు కట్టబెట్టేందుకు టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కారు. అయినా వారి ప్రయత్నం ఫలించకపోగా శుక్రవారానికి ఎన్నిక వాయిదా పడింది. ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించి 20 మంది వార్డు సభ్యులు ఉండగా, గత ఎన్నికల్లో కేవలం టీడీపీ వర్గీయులకు ఒకే స్థానం దక్కింది. ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య చీలికలు తెచ్చారు. ఐదు మంది వార్డు సభ్యులను వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేర్చుకున్నారు. ఇంకా 14 మంది వార్డు మెజారిటీ వార్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెంట ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికకు సంబంధించి ఉప సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన బీరం రాఘవేంద్రారెడ్డిని రాచమల్లు నిలిపారు. సాధారణంగా ఎన్నిక జరిగితే 14 మంది వార్డు సభ్యులున్న రాఘవేంద్రారెడ్డి అత్యంత సులువుగా ఉప సర్పంచ్‌గా ఎన్నికవుతారు.



వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు వెళుతున్న కారు అద్దాలు పగులగొట్టిన దృశ్యం

ఫేక్ ఐడీలు.. వార్డు సభ్యులు

ఎలాగైనా ఈ ఎన్నికలో తమ అభ్యర్థిని బరిలోకి దింపి విజయం సాధించాలని వ్యూహం పన్నిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి కుటిల ప్రయత్నాలు చేశారు. టీడీపీ వైపు ఉన్న ఆరుగురు వార్డు మెంబర్లను గురువారం ఉదయమే కార్యాలయానికి పంపారు. వేరే ప్రాంతంలో ఉన్న 12 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులను ఎన్నికకు రాకుండా అడ్డుకున్నారు. వందలాంది మంది కార్యకర్తలను గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ఏర్పాటు చేసి దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎక్కడ కనిపించినా దాడి చేశారు. రెండు మార్లు 12 మంది సభ్యులు ఎన్నిక కోసం కార్యాలయంలోకి వెళ్లాలని వాహనాల్లో రాగా టీడీపీ నాయకులు రాళ్ల వర్షం కురిపించడంతో వారు వెనక్కి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎస్ఐ మహ్మద్ రఫీ, సీఐ బాల మద్దిలేటి పోలీసు బందోబస్తుతో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులను తీసుకుని కార్యాలయం సమీపంలోకి రాగానే గుండ్రాళ్లతో వాహనాలపై దాడి చేశారు. దీంతో రెండు కార్లు పగిలిపోయాయి. వార్డు మెంబర్ వెంకట్‌తోపాటు డ్రైవర్ హరి గాయపడ్డారు. వారు కార్యాలయానికి రాకుండానే వెనక్కి వెళ్లారు. ఎలాగైనా వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులను లోనికి రానివ్వద్దని భావించిన టీడీపీ సభ్యులు తమ వ్యూహంలో భాగంగా తమ అనుచరులకు నకిలీ ఐడీ కార్డులు వేసి ఎన్నికల కార్యాలయంలోకి పంపారు. గ్రామ సచివాలయ కార్యదర్శి మహేశ్వరి పలు మార్లు అడ్డు చెప్పినా టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చి లోనికి పంపారు. లోపల ఉన్న ఉపసర్పంచ్ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి వీరు నకిలీ అభ్యర్థులని ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డి మహేశ్వరి ద్వారా ఈ విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. గంట వరకు వేచివున్న ఎన్నికల అధికారి కోరం లేదని రాశారు.



తనకు తగిలిన గాయాన్ని రాచమల్లుకు చూపుతున్న వార్డు మెంబర్ల కారు డ్రైవర్ హరి



వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

కార్యాలయంలోకి వెళ్లి అధికారులపై ఒత్తిడి

ఎన్నికల అధికారి కోరం లేదని రాసిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఆయన కుమారుడు బచ్చల ప్రతాప్, ఛీమల రాజశేఖరరెడ్డి, తోట మహేశ్వరరెడ్డి తదితరులు నేరుగా కార్యాలయంలోకి వెళ్లి అధికారిపై దౌర్జన్యం చేశారు. మరో గదిలోకి పిలిపించి దాడి చేసినట్లు సమాచారం. ఎందుకు ఎన్నికను వాయిదా వేశావని, తిరిగి నిర్వహించాలని చాలా సేపు ఆయనను ఒత్తిడి చేశారు. 12 మంది వార్డు సభ్యులను కార్యాలయంలోకి రాకుండా బయటే ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ ఎన్నిక జరిపితే తర్వాత తనకు సమస్యలు వస్తాయని భావించిన ఎన్నికల అధికారి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. పోలీసు వాహనంలో ఆయనకు భద్రత కల్పించి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ద్వారకా నగర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేశారు. ఈ సంఘటనపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్వయంగా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. శుక్రవారం మూడు అంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహిస్తామని ఎస్పీ చెప్పారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇటీవల కాలంలో ఇంతటి హింసాత్మక సంఘటనలు జరగలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

దాల్మియా పరిశ్రమ యాజమాన్యంపై ప్రజాగ్రహం

తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అధికారులకు బాధితుల ఫిర్యాదు



సమస్యలను పరిష్కరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రైతులు

జమ్మలమడుగు/మైలవరం : దాల్మియా సిమెంట్ పరిశ్రమ 4.6 టన్నుల సామర్థ్యంతో 2006లో వంక స్థలంలో కడుతుండగా.. తాము ఇబ్బంది పడతామని చెప్పేందుకు వచ్చిన తమను గేట్లవద్దే అడ్డుకున్నారని దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్న కొమెర్ల , పెద్దకొమెర్ల గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో ఆరోపించారు. అప్పట్లో ప్రజాభిప్రాయ సేకరణకు రాకుండా తమను అడ్డుకుని పరిశ్రమను స్థాపించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మైలవరం మండలం నవాబుపేట సమీపంలో ఉన్న దాల్మియా పరిశ్రమను విస్తరిం రు నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. 15 ఏళ్లుగా తాము దాల్మియా పరిశ్రమ వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించిన తర్వాతే విస్తరించాలని, లేనిపక్షంలో తాము అడ్డుకుంటామని ఆయా గ్రామాల ప్రజలు, బాధితులు అధికారులకు విన్నవించారు. వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

పరిశ్రమ నా కుమారుడు, కోడలిని చంపేసింది



దాల్మియా పరిశ్రమతో వెలువడే బూడిద, కెమికల్ వాసనతో నా కోడలికి క్యాన్సర్ సోకి మరణించింది. మా మిరప పంట దిగుబడుల్లో నాణ్యత లేదని గిట్టుబాటు ధర లభించలేదు. అప్పులు తీర్చలేక నా కుమారుడు మోషే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి కారణం ఫ్యాక్టరీ యాజమాన్యమే. ఇప్పుడు ఇద్దరి పిల్లల బాధ్యత నాపై పడింది.

\- స్వామిదాసు, దుగ్గనపల్లి, మైలవరం మండలం

నా కుమారుడు క్యాన్సర్‌తో చనిపోయాడు



దాల్మియా పరిశ్రమతో వెలువడే బూడిత, కెమికల్ వాసన పీల్చడంతో నా కుమారుడికి క్యాన్సర్ వచ్చి మరణించినాడు. 1.75 ఎకరాల భూమిని సాగుచేసుకుందామంటే పొలాల్లో నీరు వచ్చి చేరుతోంది.

అప్పులు పెరిగిపోవడంతో బయట పనులకు పోతున్నాం. వంకలకు అడ్డంగా దాల్మియా పరిశ్రమ గోడలు కట్టడంతో మా పొలాలకు నీరు చేరుతోంది. నా కుమారుడి మరణానికి పరిశ్రమ యజమానులే కారణం.

\- శాంతమ్మ, దుగ్గనపల్లి, మైలవరం మండలం

గ్రామంలో ప్రతిఒక్కరూ అనారోగ్యంతో ఉన్నారు



పరిశ్రమ నుంచి వెలువడే ధూమ్ము, ధూళి, కెమికల్ వాసనతో ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి. మా సమస్యలు దాల్మియా యాజమాన్యం, అధికారులకు వివరించినా ఎవరూ స్పందించలేదు. ఇళ్లలో బూడిద పడడంతో మా ఇళ్లకు బంధువులు రావడం మానేశారు. అధికారులు మా సమస్యలకు పరిష్కారం చూపకపోతే దాల్మియా పరిశ్రమ ఎదుట ఆత్మహత్య చేసుకుంటాం.

\- మేరి, దుగ్గనపల్లి, మైలవరం మండలం

ముందు మా సమస్యలు పరిష్కరించాలి



2007లో దాల్మియా పరిశ్రమ ఎర్పడినప్పటి నుంచి నవాబుపేట, దుగ్గనపల్లి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వంకల్లో పరిశ్రమ కట్టడంతోపాటు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. వంకలో చేరాల్సిన 33 వేల క్యూసెక్కుల నీరు మా గ్రామాలను ముంచేస్తున్నాయి. బ్లాస్టింగ్‌తో ఇళ్లు దెబ్బతిన్నాయి. గతంలో ఏడుగురు ఇంటిపై నుంచి పడి మరణించారు. మా సమస్యల పరిష్కరించిన తర్వాత విస్తరించాలి.

\- భాస్కర్‌రెడ్డి, నవాబుపేట, మైలవరంర మండలం

శాశ్వత పరిష్కారం చూపాకే విస్తరణ

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు/మైలవరం : దాల్మియా పరిశ్రమ నిర్మాణ సమయంలో జరిగిన తప్పిదంతో దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్న కొమెర్ల గ్రామాల ప్రజలకు సమస్యలు ఎదురయ్యాయి. వారికి శాశ్వత పరిష్కారం చూపిన తర్వాతే ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మైలవరం మండలం దాల్మియా పరిశ్రమ ఆవరణలో ప్లాంట్ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పరిసర గ్రామాల్లో సమస్యలపై పర్యావరణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదులు పంపాలని కోరారు. దుగ్గనపల్లి గ్రామానికి చెందిన చీపాటి మోషే ఆత్మహత్యకు, గ్రామంలో ఎంతోమంది అప్పులబారిన పడడానికి దాల్మియా పరిశ్రమ కారణమన్నారు. నవాబుపేట గ్రామంలో ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయోననే భయంతో ప్రజలు జీవనం గడుపుతున్నారన్నారు. పరిశ్రమ ప్రహరీ వల్ల వర్షపు నీరు పొలాల్లో చేరిడం పంటలు రాక రైతులు ఆదాయ మార్గాన్ని కోల్పోయారన్నారు. 2006లో పరిశ్రమ యాజమాన్యం యువకులకు ఉద్యోగాలిస్తామంటూ ప్రతి ఇంటి నుంచి భూమిని తీసుకుని ఉపాధి కల్పించలేదన్నారు. యాజమాన్యం గేటు వద్దకు రానివ్వకుండా తరిమికొడుతుండడంతో ప్రజలు లోకాయుక్తను ఆశ్రయించారన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు దాల్మియా యాజమాన్యం పెట్టుకున్న దరఖాస్తు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత దాల్మియా యాజమాన్యంపై ఉందన్నారు. దుగ్గనపల్లి గ్రామాన్ని వేరే చోట ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం పరిహారం ఇవ్వాలని కోరారు. ఉచిత వైద్యం, ఉచిత విద్య, ఉచిత నీరు అందించాలని, పరిసర గ్రామస్థులు కోరినట్లు సమస్యలు పరిష్కరించి విస్తరణ పనులు చేపట్టాలన్నారు.

బాధితులకు సరైన న్యాయం చేస్తాం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దాల్మియా పరిశ్రమతో నష్టపోతున్న ప్రజలకు న్యాయం చే స్తామని జిల్లా కలెక్టర్ శ్రీధర్‌చెరకూరి పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండు, మూడు సార్లు ఆర్డీఓ గ్రామాల్లో పర్యటించి తనకు నివేదిక ఇచ్చారని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పలుమార్లు సమస్యను తన దృష్టికి తెచ్చారని అన్నారు. దుగ్గనపల్లి గ్రామ ప్రజలను తాము కోరుకున్న ప్రాంతానికి తరలించటానికి యాజమాన్యం ఒప్పుకుందని, పంట భూములకు సైతం పరిహారం ఇప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఒప్పుకున్న మేరకు పరిశ్రమ యాజమన్యాం నడుచుకోకపోతే లైసన్సు రద్దు చేయడానికి వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిశ్రీ, పర్యావరణశాఖ అధికారి సుధ కురుబ, చీఫ్ ఇంజినీర్ మునిస్వామినాయుడు, దాల్మియా డైరెక్టర్ నిపున్ భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, తదితరులు

వేంపల్లి : మండలంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ప్లేస్‌మెంట్ ఉద్యోగాలకు ఎంపికైన వారిని గురువారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన పోసిడెక్స్ కంపెనీ తమ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరచిన తొమ్మిది మంది సీఎస్ఈ ఇంజినీరింగ్ విద్యార్థులు ఏడాదికి రూ.6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెనుగొండ రవికుమార్, వినోద్, సుందర్ పాల్గొన్నారు.

మహిళపై దాడి



చికిత్స పొందుతున్న అంకాలమ్మ

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల ఎస్సీ కాలనీకి చెందిన అంకాలమ్మ, ఆమె భర్త గంగులయ్యపై స్థానికులు రమేష్, అతడి భార్య దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అంకాలమ్మ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పులివెందుల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే తనపై ఫిర్యాదు చేశారనే విషయం తెలుసుకున్న రమేష్, మళ్లీ మరో ఇద్దరు వ్యక్తులతో వచ్చి.. పోలీసులకు ఫిర్యాదు చేస్తావా, నీ అంతు చూస్తా అంటూ బెదిరించారని బాధితుడు గంగులయ్య తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



ఇరువురి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని చిన్న చౌక్ సంజన్న సర్కిల్ వద్ద ఎండు గంజాయి కలిగి ఉన్న దూదేకుల సిద్దు, తాటి నాగసురేశ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1250 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన గిద్దలూరు వాసి దాసరి నాని పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు నీలకంటేశ్వరరెడ్డి, టి.మహేంద్ర, కె.నరసింహారావు, టి.సతీష్ పాల్గొన్నారు.

చాలెంజర్స్ ట్రోఫీలో చరణి భేష్



6 వికెట్లు తీసిన శ్రీచరణి

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారిణి ఎస్.శ్రీచరణి బీసీసీఐ సీనియర్ ఉమెన్స్ చాలెంజర్స్ ట్రోఫీలో భళా అనిపించారు. డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న బీసీసీఐ సీనియర్ ఉమెన్స్ చాలెంజర్స్ ట్రోఫీలో యర్రగుంట్ల మండటం యర్రంపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి ఆరు వికెట్లతో ప్రత్యర్థి జట్టును ఇరుకున పెట్టింది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మల్టీ డేస్ మ్యాచ్‌లో టీం–ఎ, టీం–బి జట్లు తలపడగా, టీం–బీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీచరణి 32 ఓవర్లలో 8 మెయిడిన్ ఓవర్లు వేయడంతోపాటు 6 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేసింది. శ్రీచరణిని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ.55 లక్షలకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, ఉమెన్ క్రికెట్ సమన్వయకర్త కల్యాణదుర్గం విష్ణుమోహనరావు, తదితరులు శ్రీచరణికి అభినందనలు తెలిపారు.

పోలీసుల పహారాలో మట్టిరోడ్డు పనులు

వైఎస్సార్ కడప జిల్లా గొందిపల్లెలో కొనసాగుతున్న పోలీసు పికెట్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వేముల మండలం గొందిపల్లె గ్రామంలో పోలీసుల పహారాలో మట్టి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకుల ఆధిపత్య పోరులో భాగంగా ఆ పార్టీకి చెందిన మైసూరారెడ్డి చేపడుతున్న మట్టి రోడ్డు పనులను అదే పార్టీకి చెందిన పార్థసారథిరెడ్డి వర్గీయులు అడ్డుకున్న విషయం తెలిసిందే. మట్టి రోడ్డు పనులను ఎలాగైనా ఆపాలన్న ఉద్దేశ్యంతో పార్థసారథిరెడ్డి అనుచరులు మట్టి రోడ్డు చేసే పని ప్రదేశంలో వీరంగం సృష్టించారు. ఒక దశలో గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు గన్ బయటకు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. టీడీపీకి చెందిన మైసూరారెడ్డి రాంగోపాల్‌రెడ్డి వర్గీయుడు కావడంతో పనులను చేయనీయకుండా ఆపాలని ప్రయత్నించినప్పటికీ ఎస్పీ జోక్యంతో పోలీసుల పహారాలోనే పనులు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు పెత్తనం చెలాయించాలనే ఆలోచనతో పాటు తమ మాటే నెగ్గాలనే పట్టుదలతో పనులను ఆపే ప్రయత్నం చేసినా ఒక వర్గానికి అది సాధ్యం కాలేదు. కాగా గొందిపల్లె గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణకు తెరతీయడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. అలాగే పనులు జరుగుతున్న కడప – పులివెందుల ప్రధాన రహదారిలోని బస్టాప్ వద్ద పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కేవలం రూ.5లక్షల మట్టి రోడ్డు పనులకే తమ ఆధిపత్యం నిరూపించుకోవాలనే ప్రయత్నాలు సాగకపోవడంతో ఒక చోట చేయాల్సిన పనులు మరొకచోట చేస్తున్నారని తెరపైకి తెచ్చారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారితో చెప్పించి మంజూరైన చోట పనులు చేయకుండా మరొక చోట చేస్తున్నారని, ఏ ప్రాంతంలో పనులు మంజూరయ్యాయో అక్కడే పనులు చేస్తారని పోలీసులు హామీ ఇవ్వడంతో ఘర్షణకు తెర పడింది.

వైఎస్.సుశీలమ్మ కుటుంబీకుల దాతృత్వం



వైఎస్ ఆనంద్‌రెడ్డి, కుటుంబ సభ్యులనుంచి వైఎస్ సుశీలమ్మ నేత్రాలను అందుకుంటున్న రాజు, తదితరులు



వైఎస్ సుశీలమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

నేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని చవ్వా సుభాకర్‌రెడ్డి కాలనీలోని వైఎస్.సుశీలమ్మ నేత్రాలను దానం చేసి ఆమె కుటుంబీకులు దాతృత్వం చాటుకున్నారు. బుధవారం సుశీలమ్మ మృతి చెందడంతో ఆమె నేత్రాలు దానం చేసేందుకు భర్త వైఎస్.ఆనంద్‌రెడ్డి, కుమారుడు వైఎస్.రాజేష్‌రెడ్డి, కుమార్తెలు వైఎస్.సునీత, సాధన అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ సభ్యుడు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి రాజు మృతురాలి ఇంటికి వెళ్లి వైఎస్.సుశీలమ్మ కార్నియాలు సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులు మరణించిన సమయంలో దుఃఖంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు సమయ స్ఫూర్తితో నేత్రదానానికి అంగీకరించి 9866727534, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

వైఎస్.సుశీలమ్మకు ఎంపీ నివాళి

పులివెందుల రూరల్ : పట్టణంలోని చవ్వాసుభాకర్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న వైఎస్.ఆనంద్‌రెడ్డి సతీమణి వైఎస్.సుశీలమ్మ బుధవారం మృతి చెందారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి మృతురాలి ఇంటికి వెళ్లి సుశీలమ్మ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సుశీలమ్మ భర్త వైఎస్.ఆనంద్‌రెడ్డి, కుమారుడు వైఎస్.రాజేష్‌రెడ్డి, కుమార్తెలు సునీత, సాధనలను ఎంపీ పరామర్శించారు. అనంతరం పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్ సమాధుల తోటలో జరిగిన వైఎస్.సుశీలమ్మ అంత్యక్రియలు జరిగాయి. వైఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎస్.ప్రతాప్‌రెడ్డి, వైఎస్.జోసెఫ్‌రెడ్డి, వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్.ప్రమీలమ్మ, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్ కుటుంబసభ్యులు జగదీశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బంధువులు పాల్గొన్నారు.

టీడీపీ గూండాల దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి
- ఇంటి వద్దకు వెళ్లి లాక్కొచ్చి దౌర్జన్యం



ప్రతాప్‌రెడ్డిని ఇంటి నుంచి బయటకు లాక్కెళుతున్న టీడీపీ గుండాలు (సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫొటో)

పులివెందుల : పులివెందులలో టీడీపీ గూండాల అరాచకాలు హెచ్చుమీరుతున్నాయి. అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని యథేచ్ఛగా అక్రమాలు చేస్తున్న టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. గురువారం ఉదయం భాకరాపురంలోని తన ఇంటిలో టిఫిన్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మైనింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని బయటకు లాక్కొచ్చి దాడి చేశారు. దాదాపు 30మంది యువకులు బైకులపై ప్రతాప్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి దాడి చేసినట్లు తెలుస్తోంది. బీటెక్ రవిపై పోస్టులు పెట్టే మగాడివా అంటూ దూషించారని, తనకు అసలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడమే తెలియదని చెబుతున్నా దాడి చేశారని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. దాడి దృశ్యాలు ప్రతాప్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోసం వెళ్లినందుకే..

బుధవారం టీడీపీకి చెందిన ఓ నాయకుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డిని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. దీన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్న అనే యువకుడు సోషల్ మీడియాలోనే టీడీపీ నాయకుడు పెట్టిన పోస్టును ట్యాగ్ చేస్తూ కౌంటర్ పోస్టు పెట్టాడు. దీంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు చిన్నాను పులివెందుల పోలీసులు అదుపులోకి తీసుకుని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచి అతనిపై నాటు సారా కేసు కట్టేందుకు ప్రయత్నించసాగారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ ఎస్ఐ, డీఎస్పీలతో చర్చించారు. చిన్నాపై అక్రమ కేసు బనాయించడం అన్యాయమని ప్రతాప్‌రెడ్డి డీఎస్పీ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న టీడీపీ నాయకులు గురువారం తనపై దాడి చేశారని ప్రతాప్‌రెడ్డి ఆరోపిస్తున్నాడు. ఎలాగైతేనేమి వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్నాపై గురువారం నాటు సారా కేసు పోలీసులు నమోదు చేశారు. ప్రతాప్‌రెడ్డిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన ఇంటి వద్దకు వెళ్లి సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించి ప్రతాప్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

ఎస్పీకి ఫోన్ చేసిన ఎంపీ

ప్రతాప్‌రెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌కు ఫోన్ చేశారు. జిల్లాలో సర్పంచ్, ఎంపీపీల ఎన్నికల సందర్భంగా గోపవరంతోపాటు ఇతర ప్రాంతాలలో టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను ఆయన దృష్టికి తెచ్చారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రతాప్‌రెడ్డిపై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు.

గండి హుండీల ఆదాయం రూ.9.07లక్షలు



హుండీలలో సొమ్మును లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడక గ్రామంలోని గండి వీరాంజనేయస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు ద్వారా రూ.9,07,554 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హుండీల ద్వారా రూ.9,07,554ల నగదు, 005.00గ్రాముల బంగారు, 320.00 గ్రాముల వెండి, అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.14,407ల ఆదాయం వచ్చిందన్నారు. మధ్యాహ్నం బహిరంగ వేలం ద్వారా ఆలయంలో పాలు, పెరుగు, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా వేంపల్లెకు చెందిన సుధీర్ దక్కించుకున్నారన్నారు. దేవస్థాన భూములు, షాపింగ్ కాంప్లెక్స్ గదుల లీజు హక్కులకు, ఖాళీ నెయ్యి డబ్బాలు, నిరూపయోగ వస్తువుల విక్రయాలు, కూరగాయల సరఫరా హక్కులకు ఎవరూ డిపాజిట్ కట్టి పాల్గొనకపోవడంతో వాయిదా పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ, బోర్డు సభ్యులు, ఏపీజీబీ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీటీసీ నుంచి జెడ్పీ చైర్మన్ దాకా..

పట్టు సాధించిన ముత్యాల రామగోవిందరెడ్డి



బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గంలో వెనుకబడిన బ్రహ్మంగారి మఠం మండలం నుంచి రాజకీయాల్లో రాణిస్తున్నారు రామగోవిందరెడ్డి. ఎంపీటీసీగా ఎన్నికై రాజకీయాల్లో పట్టు సాధించిన ఆయన నేడు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ జౌకుపల్లె గ్రామానికి చెందిన ముత్యాల పిచ్చిరెడ్డి మునుసూబుకు 1962 ఫిబ్రవరి, ఒకటో తేదీన ముత్యాల రామగోవిందరెడ్డి జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు జౌకుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆరు నుంచి పదో తరగతి వరకు పలుగురాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో కొత్తపల్లెకు చెందిన పుట్టా సుధాకర్‌యాదవ్ (ఎమ్మెల్యే)తో కలిసి ఆయన చదువుకున్నారు. పోరుమామిళ్లలో ఇంటర్మీడియట్ చదివి తరువాత 1984లో 23 ఏళ్లలో క్లాస్–1 కాంట్రాక్టర్‌గా పనులు చేపట్టారు. 2006లో అప్పటి కాంగ్రెస్ పార్టీ తరపున పలుగురాళ్లపల్లె ఎంపీటీసీగా ఏకగ్రీవమయ్యారు. మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిల ఆధ్వర్యంలో 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు, బి.మఠం జెడ్పీటీసీగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి చెంచయ్యగారిపల్లెకు చెందిన పోలిరెడ్డిపై 5000 మెజార్టీతో గెలిచాడు, అప్పుడే జెడ్పీ చైర్మన్ కోసం ప్రయత్నాలు చేసినా దక్కలేదు. 2019లో మళ్లీ జెడ్పీటీసీగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. రాజకీయ సమీకరణాలతో అప్పటి సీఎం జగన్ రాజంపేటకు అవకాశం ఇచ్చారు. అనంతరం నేడు ఆయన జెడ్పీ చైర్మన్‌గా అవకాశం దక్కింది. ఇదే పంచాయతీలో మరొరు ఎమ్మెల్యేగా ఉంటే ఈయన జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికవడం విశేషం. 40మంది జెడ్పీటీసీల సభ్యుల ఆమోదంతో జెడ్పీ చైర్మన్ పీఠం ఎక్కారు. రామగోవిందరెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా అందరికీ వివాహమైంది.

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



తలమంచిపట్నం స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

జమ్మలమడుగు : మైలవరం మండలం తలమంచి పట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ జి.అశోక్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, సబ్ డివిజన్‌లో చోరీలు, ఇతర నేరాలు జరగకుండా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్‌పై అవగాహన కల్పించి మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించాలని సూచించారు. పోలీసులు గ్రామాలకు వెళ్లి ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు గోపాల్‌రెడ్డి, లింగప్ప ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.